# అంతా దైవేచ్ఛ

"శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు. అందుకని అయిందానికీ కానిదానికీ బుర్ర బద్దలు కొట్టుకోవడంలో అర్థం లేదు!"

"అంతా అల్లా దయ! ఆయనెలా నిర్ధారిస్తే అలాగే జరుగుతుంది!"

"యెహోవా ఎరుక లేకుండా ఏ పనీ జరగదు!"

"ఇది మతపరమైన నమ్మకం కావచ్చు. అపజయం ఎదురైనప్పుడు వేదాంత ధోరణిలో, మనసుని సమాధానపరచుకొనే తీరు కావచ్చు. ఈ రెండింటిలో ఏ భావనతో మీరీ మాటలన్నారు?"

"అదీ యిదీ కూడాను. సృష్టికర్త ఇష్టానుసారమే అంతా జరుగుతుంది."

"అంటే మీరు ద్వంద్వ నీతిని అనుసరిస్తున్నారు. మతాల్ని దేవుడు సృష్టించలేదు. మానవులు సృష్టించారు!"

"అది కూడా జగత్ప్రభువు అభీష్ట ప్రకారం జరిగింది".

"అయితే ఇన్ని నమ్మకాలూ, మతాలూ ఈశ్వరుని అభీష్ట ప్రకారమే జరిగితే, అందరూ ఎందుకు కొట్టుకు చస్తూన్నట్టు?! జగద్రక్షకుడైన ఈశ్వరుడిటువంటి వెర్రిపని ఎందుకు చేస్తాడు?"

"అల్లా మహమ్మద్‌ని మతం స్థాపించమని ప్రేరేపించాడు".

"యెహోవా ఏసుప్రభువుని మతం స్థాపించమని పురమాయించాడు."

"బ్రహ్మ...... కాదు విష్ణువు... కాదు కాదు శివుడు...."

"నీ సంధిగ్ధం అర్థమౌతూనే ఉంది. "హిందూ మతాన్ని స్థాపించమని ఆజ్ఞనిచ్చిన దేముడెవరూ?" అని".

"అది వేద మతం! వేదాలలోని సారాన్ని జీవన విధానాల కన్వయించిన జీవన ధర్మం."

"ఖురానూ, బైబిలూ చెప్పేదేమిటి?"

"ధర్మపథంలో చరించమని."

"జైనులూ, బౌద్ధులూ, జొరాస్ట్రియన్లూ చెప్పేదేమిటి?"

"ధర్మమార్గంలో పయనించమని."

"దేముడు లేడని చెప్పే వారిలో కూడా, మంచి మార్గంలో పయనించే వారున్నారు. మరి వారే మతస్తులు?"

"...."

"దేముడనే వాడున్నా అతను నిరాకారుడు. సర్వాంతర్యామి. ఆ దేముడికి రూపాల్నిచ్చిందీ, పేర్లు పెట్టిందీ మానవులే. దేవుడున్నాడని భయపెట్టి, దేముడి పేరుతో, సమాజంలోని వ్యక్తులు సక్రమమైన మార్గంలో పయనించడానికి విజ్ఞులు చేసిన యత్నమే మతంగా మారింది. మతం అంటే ఓ నమ్మకం మాత్రమే"

"అంటే మత ప్రవక్తలందరూ, లేని దేవుణ్ణి ఊహించారంటారా?"

"అందుకే కదా ఇందరు దేవుళ్ళున్నారు. ఇన్ని మతాలున్నాయి. ఒకవేళ ఉన్నా, నేనిందాకా చెప్పినట్టు అతడు నిరాకారుడు. ఆ విధంగా ఆలోచించినా, వేరు వేరు మత ప్రవక్తలు వేరు వేరు రూపాల్ని ఆపాదించారు. అల్లా ఉండే లోకమేది? యెహోవా ఉండే స్వర్గమెక్కడుంది? హిందూ మతస్తులు నమ్మే ముక్కోటి దేవతల లోకాలెక్కడున్నాయి? మానవులు వ్రాసిన పురాణాల్లో ఉన్నాయి. మత ప్రవక్తల ఊహల్లో ఉన్నాయి. మనుషుల మనస్సుల్లో ఉన్నాయి. దేముడున్నా లేకపోయినా 'మంచీ చెడూ' అనేవి ఉన్నాయి. మతం చెప్పేది మంచీ, చెడులని గురించే - అంతకు మించి దాని ప్రయోజనం లేదు!"

"అవుననుకోండి...."

"సంతోషం, ఒక్క మెట్టు దిగారు. దేముడెక్కడున్నాడో మనకి తెలియదు. ఉన్నాడనుకొన్న వారికి ఉన్నాడు. లేడనుకొన్న వారికి లేడు. కాని మనకి కనపడేది మనం నివసించే భూమి. దాంట్లో సరస్సులున్నాయి నదులున్నాయి, సాగరాలున్నాయి. దిబ్బలున్నాయి. కొండలున్నాయి. పర్వతాలున్నాయి. పంట భూములున్నాయి. ఎడారులున్నాయి. మొక్కలున్నాయి. వృక్షాలున్నాయి, అరణ్యాలున్నాయి. కంటికి కనపడకపోయినా, స్పర్శతో తెలిసే గాలి భూమిని ఆవరించి ప్రాణవాయువు నందిస్తోంది. అంచేత భూమిని నేను దేముడంటాను. భూమి మీద అనేకానేకమైన జీవనాధార ప్రక్రియలకు మూల కారణమైన సూర్యకాంతిని ప్రసరించే సూర్యుడాకాశంలో ఉన్నాడు. అందుకని సూర్యుణ్ణి దేముడంటాను. ఏమంటారు?"

"సూర్యోపాసకులు ఇప్పటికే చాలామంది ఉన్నారు. సూర్యుడికి భూమిని కూడా చేరిస్తే వచ్చే నష్టం లేదు."

"క్రిమి కీటకాదులున్నాయి. నీటిలో చిన్న చేపల దగ్గర్నుంచి తిమింగిలాల వరకూ ఉన్నాయి. గాలిలో ఎగిరే సీతాకోకచిలుకల దగ్గర్నుంచి గద్దల వరకూ ఉన్నాయి. భూచరాలైన జంతువులున్నాయి. ఘన శరీరం గల ఏనుగులున్నాయి. అల్ప శరీరం కల చిట్టెలుకలున్నాయి. సాధు జంతువులున్నాయి. క్రూర మృగాలున్నాయి. ఇవే కాకుండా ఉభయ చరాలున్నాయి. ఈ జీవరాశులన్నిటితో బాటు మానవులు కూడా ఉన్నారు. ధరణి వీటికన్నిటికీ మానవులతో సహా జీవనాధారం. అందుచేత ఈ భూమి మీద నివసించడానికి మాట నేర్చిన మానవజాతికి ఎంత హక్కుందో, మిగిలిన జీవరాశులకీ అంతే హక్కుంటుందంటాను. ఏమంటారు?"

"లేదని ఏవరన్నారు?"

"అటువంటప్పుడు మనం జీవహింస ఎందుకు చేస్తున్నాం? వాటిని ఎందుకు చంపుతున్నాం?"

"బ్రతకడానికి నీరూ, గాలీ చాలదు. ఆహారం కూడా ఉండాలి. మాంసం కూడా ఒక ఆహారమే!"

"పక్షుల్నీ, అవి పెట్టిన గుడ్లనీ భక్షించమని, పశువులకి మేత పెట్టి అవి బలిసిన తర్వాత

చంపి తినమని ఎవరు చెప్పారు? దేముడు చెప్పాడా? మతాల్ని రచించిన మత ప్రవక్తలు చెప్పారా?"

"మనుగడకు మనిషి మేధస్సు గుర్తించిన ఆహారాల్లో మాంసాహారం కూడా ఒకటి"

"సరే, మీ మాటే ఒప్పుకొంటున్నాను. మరి వినోదం కోసం వేటనెందుకు చేస్తున్నట్టు? చర్మాల కోసం మృగాలనెందుకు చంపుతున్నట్టు? దంతాల కోసం ఏనుగులనెందుకు హతమారుస్తున్నట్టు?"

"అదీ ఒకరకమైన జీవనాధారమే."

"అందుకని జంతువుల్ని చంపితే పాపం లేదంటారు? నువ్వు నమ్మిన మతం పాపం లేదంటుంది. మరొకరు నమ్మిన జైన మతం పాపం అంటుంది. సరే మనిషినెందుకు చంపరు? నరమాంస భక్షకుల్ని సమాజం ఎందుకు చీదరించుకుంటుంది? మనిషిని చంపిన వాణ్ణి, న్యాయస్థానం ఎందుకు ఉరికంబం ఎక్కిస్తుంది?"

"మనిషి జీవరాశుల్లో అగ్రగణ్యుడు. అతడు సమాజంలో ఒక భాగం."

"సమాజం ప్రకృతిలో ఒక భాగం. సమస్త చరాచర జీవరాశులు కూడా ప్రకృతిలో భాగమే. సరే, మనిషిని చంపకూడదు. దేశాల మధ్య జరిగే యుద్ధాల్లో మనుషులనెందుకు చంపుతున్నారు?"

"అది మన దేశాన్ని రక్షించుకోవడం కోసం. మన భూభాగాన్ని రక్షించుకోవడం కోసం."

"ఆ భూమినే కదా మనం ప్రకృతి అంటున్నాం. ఉరిశిక్ష పేరుతో హంతకుల్ని చంపి సమాజాన్ని, శతృదేశ సైనికుల్ని చంపి దేశాన్ని, రక్షించుకోవడం తప్పుకాదంటారు. అవునా?"

"మీరేదో తిరకాసుగా మాట్లాడుతున్నారు!"

"తిరకాసుగా కాదు, తిన్నగానే మాట్లాడుతున్నాను. సరే మరో ప్రశ్న – మృత్యువుని గురించి మీ అభిప్రాయమేమిటి?"

"ఆ ఘడియ వచ్చినప్పుడు పోక తప్పదు!"

"సమాధానంలో వేదాంతం కనపడ్తోంది. ప్రమాదంలో పచ్చడైతే అర క్షణంలో మృత్యురేఖ కవతలి వైపు వెళ్ళడం ఎలాగా తప్పదు. కాని రోగం వచ్చిందనుకోండి. మరణం కోసం ఎదురు చూస్తూ కూర్చోరు కదా?! రోగం నయమవడం కోసం వైద్యం చేయించుకొంటారు! – అవునా?"

"రోగం వచ్చినప్పుడు మందు పుచ్చుకోవడంలో తప్పేముంది?"

"పరాత్పరుడి ఆజ్ఞ లేనిదే ఏమీ జరగదన్న మీరు, రోగం వచ్చినప్పుడు మరణ భయంతో మందెందుకు తీసుకోవాలి? ఆయుర్దాయం ఉంటే మందు తీసుకున్నా, తీసుకోకపోయినా జీవిస్తారు. అది లేకపోతే, తీసుకొన్నా, తీసుకోకపోయినా మరణిస్తారు. మందులు తీసుకోమని మతం చెప్పిందా? మందులెలా తయారు చెయ్యాలో మతం చెప్పిందా?"

"వేదాలు ఆయుర్వేదం గురించి చెప్పాయి."

"యునానీ వైద్యం కూడా రోగాల్ని నయం చేస్తుంది!"

"ఎల్లోపతీ, హోమియోపతీ కూడా రోగాల్ని జయిస్తాయి. శస్త్ర చికిత్స అద్భుతాలని సాధిస్తోంది."

"ఈ వైద్యాలన్నీ మతం చెప్పినవి కావు. శాస్త్రాలు చెప్పినవి. మానవులు పరిశోధించి వ్రాసినవే ఆ శాస్త్రాలన్నీ."

"అవును. అవన్నీ భగవద్కటాక్షం వల్ల తెలిసినవే!"

"మీరంటూన్న ఆ దేముడనేవాడు మానవుడికి మెదడూ మాటా యిచ్చిన తర్వాత, వేరే కటాక్షం ప్రతి పనికీ అవసరం లేదు. ఆలోచనలతో మానవుడు చేసిన ప్రయోగాల ఫలితాలే శాస్త్రాలు. ప్రగతిని సాధించింది మానవయత్నం మూలానే. ఏమంటారు? జీవరాశుల్లో అగ్రగణ్యుడు మానవుడన్నది మీరేగా?"

"సరే"

"జీవరాశుల్లో సృష్టికార్యం లేదా సంతానోత్పత్తి ఎలా జరుగుతుందో చెప్పిందీ శాస్త్రజ్ఞులే కదా?"

"వైద్య శాస్త్రజ్ఞులు."

"సరేనయ్యా, వైద్య శాస్త్రజ్ఞులు. అయితే కుటుంబ నియంత్రణపై మీ అభిప్రాయమేమిటి? జనాభా పెరుగుదల విషయమై మీ ఆలోచన ఏమిటి?

"మీరడిగిన ఈ ప్రశ్నకి మేం చెప్పిన సమాధానాలతోనే ఈ సంభాషణ మొదలైందని మీరు మర్చిపోయినట్టున్నారు?"

"మర్చిపోలేదు. ఆ సంభాషణ యింత జరిగిన తర్వాత, మీ అభిప్రాయంలో ఏమైనా మార్పు వస్తుందేమోనని అడిగాను. ఏమంటారు?"

"అనుకొంటూనే ఉన్నాం. మీరు మమ్మల్ని ఎక్కడికో లాక్కువెడ్తున్నారని."

"సమాధానం చెప్పారు కాదు."

"సృష్టికార్యం ప్రకృతి నిర్ణయం. దాన్ని ఆపకూడదు."

"నిజం చెప్పండి, సృష్టికార్యం మీరు సుఖం కోసం చేస్తున్నారా, లేక కేవలం సంతానం కోసం చేస్తున్నారా?"

"సుఖం కోసం చేస్తున్నాం. సంతానమనేది దాని ఫలితం. అది దేవుని వరం!"

"పురుషేంద్రియంలోని లక్షలాది వీర్య కణాల్లో కేవలం ఒక్కటి మట్టుకు, స్త్రీ నెలకోసారి విడచే అండాన్ని సరైన సమయంలో చేరుకొంటేనే గర్భధారణ జరుగుతోంది. ఆ రెండింటి సంయోగం చెందితేనే కాని, జీవంతో కూడిన పిండం ఏర్పడదు. అందుచేత స్త్రీ పురుషుల ప్రతి సంగమంలోనూ అండానికి జీవం పోసే లక్షలాది వీర్యకణాలు నశిస్తున్నాయి. సరైన సమయంలో వీర్యకణంతో సంయోగం చెందకపోతే అండం కూడా నశిస్తుంది. ఈ సత్యాన్ని వైద్యశాస్త్రం కనుక్కొంది. తెలుసా?"

"తెలుసు!"

"అందుకని, దేముడు దగ్గర కూర్చుని వీర్యకణాల్ని అండం వైపు కొరడాలతో కొట్టి తోలడు! అదంతా దేహాలలో జరిగే సహజ ప్రక్రియ. దేహం చేసే ప్రక్రియని మనం అదుపులో పెట్టుకోవడం తప్పు కాదు. రోగ నిరోధానికి మందులాగ."

"....."

"అండం పిండంగా మారిన తర్వాత, కోరి గర్భస్రావం చేయించుకొనే విషయంపై మతాధికారుల అభిప్రాయాలు దాదాపు ఒకేరీతిగా వ్యతిరేక దిశలో ఉన్నా, తల్లి ప్రాణానికి ముప్పు ఉంటే అది అవసరమని వైద్యశాస్త్రం చెప్తోంది. కాలు జారిన సందర్భాల్లో సమాజంలో

తలెత్తుకొని తిరిగేందుకు, నమ్మకాల్ని పక్కకు నెట్టి రహస్యంగా భ్రూణ హత్యలు చేయించుకొంటూనే ఉన్నారు. పిల్లని కనాలా లేదా అనే ప్రాథమిక హక్కు స్త్రీకి యిచ్చి, గర్భస్రావాన్ని న్యాయ సమ్మతం చేసిన ప్రభుత్వాలనేకం ఉన్నాయి. కట్టుకొన్న ఆడదానికి మరో కాన్పు కనక వస్తే ఇంతే సంగతులని వైద్యులు చెప్పిన తర్వాత, అప్పటికే మరోమారు గర్భంతో ఉన్న స్త్రీ విషయమై ఏం చేస్తారు? లేదా మరోసారి గర్భం రాకుండా ఉండాలంటే ఏం చేస్తారు?"

"......."

"పెళ్ళాం ప్రాణాలు కాపాడుకోవడం కోసం గర్భస్రావం చేయించి తీరాలి. లేదా భార్యకి గర్భం రాకుండా ఏదో సంతాన నిరోధక చర్య అవలంబించి తీరాలి. ఏమంటారు?"

"పిల్ల ప్రాణం కంటె తల్లి ప్రాణం ముఖ్యం."

"ఈ నిర్ణయం మీరు తీసుకొంటారు. అప్పుడు దేముడ్ని గురించీ, మతం గురించీ ఆలోచించరు. సమాజ రక్షణ కోసం, దేశ రక్షణ కోసం మానవుల్ని చంపడం పాపం కాదన్నారు, ఇందాకా మీరు. తల్లి ప్రాణానికి ముప్పు వస్తే పిండ రూపాన్ని స్రావం చెయ్యడంలో తప్పులేదంటున్నారు యిప్పుడు. సమస్త కోటి జీవరాశులకీ ఆశ్రయమిచ్చే ధరణి మాతని, హద్దులు దాటి శక్తిని సంతరించుకొంటున్న నిశ్శబ్ద మానవ జనాభాస్త్రం దగ్ధం చేయబోతోంది. జనన రహస్యం తెలిసిన మీరు, ధరణి మాతను రక్షించుకోవడం కోసం, అండాలనికీ రేతస్సుకీ మధ్య అడ్డంకి కల్పించి, అండం పిండ రూపం దాల్చకుండా చేస్తే మీ సొమ్మేం పోయిందట? మీ సుఖానికేం తక్కువొచ్చిందట?!"

"........."

"నిజానికి మీకు చాలా సొమ్ము మిగిలి, మీ జీవనస్థాయి పెరుగుతుంది. అదీ కాకుండా జనాభా తక్కువున్న దేశం చాలా కాలం ఎలా సుభిక్షంగా ఉంటుందో, తక్కువ సంతానమున్న స్త్రీ, యాభై దాటినా దిట్టంగానే ఉంటుంది. చాలా కాలం వరకూ సుఖాలకీ కొదవుండదు!– మన కంపెనీ ఆస్పత్రిలో, వచ్చే వారం నుండి నలుగురు సర్జన్లు వేసెక్టమీ శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. మీరు సిద్ధంగా ఉండండి."

"మా పెద్దలు ఒప్పుకోరు."

"మీరు ఒప్పుకొన్నట్టేగా?"

"అవుననుకోండి...... కాని..."

"మతాలు మనస్సుని అదుపులో ఉంచుకొనేందుకు పాటించాలి కాని, దేశ శ్రేయస్సుని అడ్డుకోవడానికి కాదని నచ్చ చెప్పండి"

"మా వాళ్ళకు తెలియకుండా..."

"ఓ, అలాగన్నారు బావుంది! మన మద్రాసు బ్రాంచ్‌లో కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మిమ్మల్ని డెహ్రాడూన్ నుంచి మద్రాసులో జరిగే కాన్ఫరెన్సుకి పంపిస్తాను. నేను వీరప్పన్‌కి టెలిఫోను చేస్తాను. అతను మీకు కావల్సిన ఏర్పాట్లు చేస్తాడు. అక్కడ ఆపరేషన్ బల్ల ఎక్కండి, ఓ.కే.?"

"అలాగే నండి"

"థాంక్స్! యూ కెన్ గో నౌ!"